# ఆర్.టి. నోబుల్ జీవితయానం

జాన్ నోబుల్

తెలుగు సృజన

**డా॥ అక్కిరాజు రమాపతిరావు**

ఎమెస్కో

# విషయ సూచిక


1. తల్లిదండ్రులు – కుటుంబచరిత్ర ...................... 01
2. స్కూలు చదువు ........................................ 13
3. కాలేజీ జీవితం ........................................ 23
4. మత ప్రచార జీవితానికి సన్నాహం .................. 40
5. తొలిసారి ప్రబోధక వృత్తిలో ప్రవేశం ................ 67
6. తెలుగు మిషన్ ........................................ 86
7. మచిలీపట్నంలో ప్రవేశించటం ...................... 108
8. పాఠశాల ప్రారంభించటం ........................... 135
9. యూరోపియన్‌లపై ఆయన పలుకుబడి ............ 155
10. మిషన్ పురోభివృద్ధి.................................. 184
11. ముఖ్యాశయ ప్రతిపాదనలు ........................ 214
12. స్కూలు పేరు ప్రతిష్ఠలు ............................ 245
13. తుఫాను ఉప్పెన ..................................... 285
14. ముగింపు ............................................ 335

ప్రకరణం - 1

## 1809 - 1822

# తల్లిదండ్రులు - కుటుంబ చరిత్ర

**రా**బర్ట్ టర్లింట్‌టన్ నోబుల్ తల్లిదండ్రులు రెవ. (పూజ్య) జాన్ నోబుల్, సారా అనే పుణ్యదంపతులు. జాన్ నోబుల్ మహాశయుడు ఫ్రిస్బీ అనే గ్రామంలో చర్చ్ అధికారిగా (వికర్) పని చేశారు. ఈ ప్రాంతం సెస్టర్‌మండలం (ఇంగ్లండు) లో ఉంది. ఆర్.టి. నోబుల్ బాప్తిసమ్ (జ్ఞానస్నానం) పొందినది 1809 మార్చి 9వ తేది. క్రైస్తవమత సంప్రదాయాన్ని అనుసరించి అది ఆయన జన్మదినమన్నమాట.

రాబర్ట్ టర్లింగ్‌టన్ నోబుల్‌లోని సుగుణసంపద, మతవిశ్వాస సంప్రదాయపరత్వం, సమాజసేవాభిలాష ఆయన తల్లిదండ్రుల పవిత్రదాంపత్యజీవనం నుంచే సంక్రమించాయని చెప్పాలి. దైవదత్తంగా తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా అవి ఆయనకు వచ్చాయి. దైవకార్యం పరమాద్భుతాలను సృష్టిస్తుంది. దానిని తెలుసుకోవటం పరమాహ్లాద కరమనిపిస్తుంది. ఈ దివ్యానుగ్రహప్రవాహాల ప్రభవస్థానం ఏ విధంగా దిగివచ్చి జీవనక్షేత్రాలను - అవి నిస్సారమే అయినా - ఫలవంతం చేస్తాయో చూస్తే, జీవితానికి సంపూర్ణత్వం ప్రసాదిస్తాయో, సుందరతను చేకూరుస్తాయో తెలుసుకొంటే మనకు ఆనందదాయకం.

రాబర్ట్ నోబుల్ తండ్రి గారి జీవితం నుంచే ఇందుకు దృష్టాంతాలు చూడవచ్చు. ఇటువంటి కొన్ని దివ్యసంఘటనలు ఆయన జీవితంలో సంభవించాయి.

కిందటి శతాబ్ది మధ్యకాలంలో ఇంగ్లండులో ఒక క్రీడాకౌశలోత్సవం ప్రతి సంవత్సరం జరుగుతుండేది. దానిని వ్యాయామక్రీడాకారుల పోటీగా నిర్వహించేవారు. ఇంగ్లండులోని ఉత్తర పరగణాలైన కుంబర్‌లాండ్, వెస్ట్ మోర్ లాండ్, లంకాస్టర్‌ల సరిహద్దులు మూడూ కలిసే ప్రాంతంలో ఈ వ్యాయామక్రీడోత్సవాలు ఎంతో ఘనంగా,

ఉత్తేజకరంగా జరిగేవి. ఎక్కడెక్కడి నుంచో ప్రజలు తండోపతండాలుగా ఈ క్రీడల పోటీలను చూడటానికి వచ్చేవారు. విజేతలెవరు కాబోతారా? అని అత్యంత ఉత్సుకతతో ప్రజలు నిరీక్షించేవారు.

రాబర్ట్ తండ్రిగారు కుంబర్‌లాండ్‌కు చెందినవాడు. ఆయన సెయింట్ బీస్‌లో అప్పుడు చదువుకుంటున్నారు. మతోద్యోగ నిర్వహణశిక్షణ పొందుతున్నా రప్పుడాయన, ఆ విద్యాసంస్థలో. ఆయనప్పుడు తన పాఠశాల ద్వితీయోపాధ్యాయుడితో ఈ పోటీలు తిలకించటానికి వచ్చారు. ఆయనతో కొందరు సహ విద్యార్థులు కూడా ఉన్నారు. జాన్ నోబుల్ అప్పుడు జరుగుతున్న పోటీ దృశ్యాలను అత్యంతఉత్సుకతతో వీక్షిస్తున్నారు. ఈ పోటీలు ఇట్లా కొనసాగుతుండగా, విజేత కాబోతున్న వ్యక్తి కుంబర్‌లాండ్‌కు చెందినవాడు కాక ఇంకొక ప్రాంతానికి చెందినవాడన్న విషయం, అందరికీ స్పష్టం కాబోతున్నది. కుంబర్‌లాండ్ వారికిది ఎంతో ఉద్వేగకారకమైంది. దీనితో కుంబర్‌లాండ్ ఖ్యాతి మరెవరికో దక్కబోతున్నదని ఈ ప్రాంతీయులు ఉద్విగ్నభరితహృదయు లైనారు. వాళ్ళలో పంతం పెరిగిపోజొచ్చింది. తమ మంచిపేరును ఇతరులెవరో లాక్కొని పోతున్నారన్న ఆరాటం వారిని నిలవనియ్యటం లేదు. అయితే అప్పుడు కుంబర్‌లాండ్ వారి కళ్ళన్నీ జాన్ నోబుల్ చుట్టూ పరిభ్రమించాయి. ఆయనొక్కడే ఈ గండం నుంచి తమను రక్షించగలడని వాళ్ళనుకొన్నారు.

తమ నెదర్‌టౌన్‌వాడైన ఈయన క్రీడాస్థలిలో ప్రవేశిస్తాడా? అన్నదే వాళ్ళ ఉత్సుకత. కుంబర్‌లాండ్ వాళ్ళంతా ఆయనను బతిమాలుకుంటున్నారు. నాలుగువైపుల నుంచీ ఆయనను పోటీకి దిగవలసిందని ప్రాధేయపడుతున్నారు. ద్వితీయోపాధ్యాయుడు కూడా వాళ్ళ ఉత్కంఠకు వశుడైనాడు. ఆయన కూడా జాన్ నోబుల్‌ను ప్రోత్సహించాడు. ప్రిన్స్‌పాల్‌గారికి ఏదో విధంగా మనవి చేసి సర్దిచెపుతానని హామీ ఇచ్చాడు (ఏమంటే క్రీడల పోటీలలో పాల్గొనటం స్కూలు నియమనిబంధనలకు, క్రమశిక్షణకు విరుద్ధం). ఈ విధంగా తనను చుట్టుముడుతున్న అభ్యర్థనలను తోసి పుచ్చలేక, ఆయన తన పేరు క్రీడాకారుల జాబితాలో నమోదు చేయించుకొని, రంగంలోకి దిగాడు. అయితే ఈ పర్యవసానం అనుకున్నట్లుగా జరగలేదు, బాధాకరంగా పరిణమించింది. కాలేజీ నుంచి ఒక సంవత్సరం పాటు ఆయన ఈ ఉల్లంఘనకు బహిష్కృతుడైనాడు. సంవత్సరం తర్వాతగాని ఆయనను మళ్ళీ కళాశాలలో చేర్చుకోలేదు. అంతేకాక, ఇటువంటి నిబంధన మళ్ళీ ఇంకోసారి అతిక్రమించకూడదని షరతు విధించారు. ఈ షరతు నాయన మనఃపూర్వకంగా అంగీకరించిన తర్వాతనే మళ్ళీ ఆయనకు ప్రవేశం లభించింది. ఈ

విధంగా బహిష్కారశిక్ష, ఇరుగుపొరుగు వారి నిందాదృష్టి, చుట్టుప్రక్కల అసంతృప్తి ఆయనను ఇల్లు విడిచేట్టు చేశాయి. పొరుగూళ్లో ఆయన ఒక చిన్న ఉపాధ్యాయపదవిలో కుదురుకునేట్లు చేశాయి. అంతేకాక దైవానుగ్రహం ఆయనను ఒక సాధుసజ్జనుడి అండ చేర్చింది. ఈ సత్పురుషుడు అక్కడ ఒక రైతు. కష్టాల్లో ఉన్న తరుణవయస్కుడైన నోబుల్‌కు ఆయన కలిగించిన సాంత్వనం ఎటువంటిదంటే, జొనాథన్‌కు డేవిడ్ పట్ల కలిగిన మెప్పుదలవంటిది. ఆ పాషండుడిని (గోలియత్) డేవిడ్ పొలియింప చేయటం వల్ల జొనాథన్ డేవిడ్‌కు ప్రీతిపాత్రుడైనారు. ఈ విధంగా వాళ్ళ హృదయాలు పెనవైచుకొని పోయినాయి. వాళ్ళ సన్నిహితమైత్రి విడదీయరానంత చిక్కబడింది. ఈ స్నేహితుడు కొత్తగా తనకు లభించిన దైవసమర్పితహృదయుడైన క్రైస్తవుడు, చక్కటి బలమైన దేహసౌష్ఠవంతో, మెలి తిరిగిన కండలతో ఉన్న దృఢగాత్రుడు. ఇతడి సంరక్షణభారం తాను పూనాడు. ఈ యువకుడు అత్యంతమృదుస్వభావి. పరిశుద్ధమనస్వి. లలితాంత రంగుడు. ప్రబోధితుడు. దైవాజ్ఞ అనుశాసకుడు. అయితే ఇంతవరకు శుభవార్తలోని దైవానుగ్రహబోధకుల సిద్ధాంతాలను చక్కగా అధ్యయనం చేసి ఆకళించుకోవటం మాత్రం జరగలేదు ఇతడి విషయంలో. అందువల్ల అపోస్తలుల ఉదారాశయబద్ధుడై, ఆ సాధుసజ్జనుడు నోబుల్ పట్ల మరింత శ్రద్ధాశక్తులు, ప్రేమాను రాగాలు వహించి దైవజ్ఞానం బోధించటానికి పూనుకున్నాడు. ప్రత్యేకించి తన యువమిత్రుడికి ఆయన అత్యంతవిశ్వాసం కలిగేట్లు బోధించిందేమంటే, పరిశుద్ధాత్మ తనను ఎంపిక చేయనిదే ఏ వ్యక్తీ కూడా శుభవర్తమానం బోధించటానికి కృతకృత్యుడు కాడనీ, సత్యబోధ చేయజాలడనీ. అంతేకాక దైవానుగ్రహం అతడు తప్పక పొంది ఉండాలనీ, అప్పుడే బోధించే యోగ్యత, అర్హత తాను లభింపచేసుకుంటాడనీ కూడా ఆయన తన యువమిత్రుడిని విశ్వసింపజేశాడు. ఈ విధంగా ఆ ప్రశాంతనిమగ్నతను కల్పించుకొని, దైవనిబంధనలు అధ్యయనం చేసి, వాటి సారాన్ని స్వాయత్తం చేసుకుంటే కాని, ప్రార్థనతో ఆ దైవసహాయాన్ని అర్థిస్తే గాని, దైవబోధనను నలుగురికీ అందించ లేడన్నదే తన యువమిత్రుడికి ఆయన ప్రబోధించాడు. ఆ దివ్యవాక్కు ఫలించింది.

అప్పటి నుంచీ నోబుల్ తన హృదయకవాటాలను విప్పి పవిత్రాత్మకు నివేదించుకున్నాడు. ఏకాంతంగా తన గదిలో కూచుని తండ్రి అనుగ్రహంకోసం ధ్యానించ సాగాడు. తండ్రి ఆయనను రహస్యంగా గమనిస్తూ ఉండకపోలేదు. ఈ విధంగా నోబుల్ తర్వాతి జీవితంలో క్రమంగా పవిత్రత, పరోపకారసేవాబుద్ధి, ఆయనపట్ల గౌరవం అభివృద్ధి చెందుతూ వచ్చాయి.